క్లుప్తంగా

పశువైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



గోవును పరీక్షిస్తున్న పశువైద్యాధికారి

కొనకనమిట్ల: గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని గొట్లగట్టు పశు వైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి సూచించారు. మంగళవారం చినమనగుండం గ్రామంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేశారు. పశువుల పెంపకం, వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, సహాయకులు బరిగె శ్రీనివాసులు, మేఘవత్ శివాజీ నాయక్, కాసు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించాలి



ఏపీఎం పిచ్చయ్యను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది

మార్కాపురం టౌన్: డ్వాక్రా సంఘ మహిళలు గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించాలని వెలుగు ఏపీఎం పిచ్చయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని డ్వాక్రా బజారులో మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంఘం సమావేశం నిర్వహించి తీర్మానాలు చేయాలన్నారు. జీవనోపాధి యూనిట్ల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించాలని చెప్పారు. డ్వాక్రా రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. కాగా ఉత్తమ ఏపీఎం అవార్డు అందుకున్న సందర్భంగా పిచ్చయ్యను వెలుగు సిబ్బంది సన్మానించారు.

అధికారులే సమావేశాలకు రాకుంటే ఎలా?

పుల్లలచెరువు: మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు రాకుంటే సమావేశాలు నిర్వహించడం ఎందుకని వైఎస్సార్ సీపీ నాయకుడు, మల్లాపాలెం ఎంపీటీసీ రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి తహసీల్దార్, ఎంఈవోలు, ఏఈలు తప్పని సరిగా హాజరు కావాల్సి ఉన్నా ఎవరూ రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమని అడిగితే పని ఉందని చెబుతారని, అడిగే వారు లేకపోవడంతో మండల స్థాయి అధికారులు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోందని సభ్యులు మండిపడ్డారు. ఎంపీటీసీ సభ్యుడు రాములు మాట్లాడుతూ రెండు సార్లు గ్రామసభలు నిర్వహిస్తే ప్రజల సమస్యలు ఇంత వరకు పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు చెప్పుకోవాలన్నా ఇన్‌చార్జి తహసీల్దార్ యర్రగొండపాలేనికి పరిమితం కావడంతో కార్యాలయంలో సమాధానం చెప్పే వారు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ముటుకుల స్టోరేజీ ట్యాంకు నుంచి చుక్క నీరు గ్రామాల్లోకి రావడం లేదని, అది కేవలం అధికారులకు, నాయకులకు బ్యాంకు మాదిరిగా ఉందని, అధికారులు ముందుస్తు చర్యలు తీసుకోకుంటే ప్రజలకు నీటి సమస్యలు తప్పవన్నారు. ఎంపీడీవో వసంతరావునాయక్ మాట్లాడుతూ మండలస్థాయి అధికారులంతా సమావేశాలకు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, ఏఈ కిశోర్, ఏపీవో శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ అధికారి శివలక్ష్మి, ఏపీఎం వెంకటయ్య పాల్గొన్నారు.

ఆహ్లాదం.. శూన్యం

మేజర్ పంచాయతీ నుంచి పట్టణ హోదా పొందిన గిద్దలూరు నగర పంచాయతీలో ప్రజలకు మెరుగైన వసతులే కాదు ఆహ్లాదం కూడా కరువైంది. బడలికతో ఉన్నవారు కాసేపు సేద తీరేందుకు, చిన్నారుల ఆటవిడుపునకు అవకాశం లేకపోవడంతో ఇళ్లకే పరిమితం కావాల్సిన దుస్థితి.



- గిద్దలూరులో పార్కుల నిర్వహణపై పర్యవేక్షణ కరువు
- అపహరణకు గురవుతున్న పరికరాలు
- అసాంఘిక శక్తులు, మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- చిల్లచెట్ల మధ్యలో ఎమ్మెల్యే ముత్తుముల వేసిన శిలాఫలకం

గిద్దలూరు రూరల్:

గిద్దలూరు పట్టణంలోని పార్కుల నిర్వహణపై పాలకుల పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయి.

- పట్టణంలోని పొట్టిశ్రీరాములు సెంటర్‌లో గల చిల్డ్రన్ పార్కులో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగి ఖాళీ సీసాలు అక్కడే పడేస్తున్నారు. ఇంకొందరు ఆకతాయిలు ఖాళీ మద్యం సీసాలను పగలగొట్టి గాజు పెంకులను పడేస్తూ అక్కడ నడిచేందుకు వీల్లేకుండా చేస్తున్నారు. మరి కొందరు గేదెలు కట్టేస్తూ పశువులశాలగా మార్చారు. పార్కుకు రెండు గేట్లు ఉండగా ఒక దానిని గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచి ఇచ్చే పార్కులను పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాగం పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కులను బాగుచేయకపోయినా సహిస్తాం కానీ నాశనం చేస్తున్న వారిపై నిఘా ఉంచి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదని పట్టణానికి చెందిన పలువురు సీనియర్ సిటిజన్లు అభిప్రాయపడుతున్నారు.
- అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో గల జ్యోతిరావు పూలే పార్కులో కొందరు ఆకతాయిలు సిగరెట్లు, రాత్రి వేళ మద్యం తాగి పరిసరాలను పాడుచేస్తున్నారు.
- రాజానగర్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఘాట్ రోడ్డు వద్ద గల పార్కులో చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా తయారైంది. ఈ పార్కులో నీటి సంపు కోసం స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గతంలో వేసిన శిలాఫలకం సైతం చిల్లచెట్ల మధ్యలో ఉండిపోయింది. శిలాఫలకం వేశారుగానీ ఇంత వరకు పనులను ప్రారంభించలేదు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పార్కు స్థలంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహంతోపాటు ప్రహరీ, గేటు ఏర్పాటు చేశారు. ఈ పార్కులో అడుగుపెట్టిన వారికి పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. పార్కు పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో ఎవరూ ఇటువైపు వచ్చేందుకు ఇష్టపడటం లేదు. ప్రజాప్రతినిధులతో పాటు మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పార్కుల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.




పొట్టిశ్రీరాములు సెంటర్‌లోని చిల్డ్రన్ పార్కు గేటును అపహరించిన దుండగులు



లక్ష్మీనరసింహస్వామి ఘాట్ రోడ్డు పార్కులో పిచ్చిమొక్కల మధ్య శిలాఫలకం



శిథిలావస్థలో పార్కు బోర్డు



పొట్టిశ్రీరాములు సెంటర్‌లోని చిల్డ్రన్ పార్కులో కట్టేసిన గేదె

మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ

మార్కాపురం: గీత కులాలకు సంబంధించి మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ అయిందని మార్కాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మార్కాపురం టౌన్‌లో గాండ్ల కులానికి చెందిన వారికి ఒకరికి, రూరల్‌లో ఈడిగ కులానికి చెందిన వారికి ఒకరికి దుకాణం కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు తమ కులానికి సంబంధించి సర్టిఫికెట్ సమర్పించాలని, ఆన్‌లైన్‌లో రూ.2 లక్షలు డీడీ చెల్లించాలని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఈ నెల 7న లాటరీ తీసి లైసెన్సులు మంజూరు చేస్తారని చెప్పారు.

గీత కార్మికులకు 2 మద్యం దుకాణాలు

కంభం: కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కులాలకు రెండు మద్యం దుకాణాలు కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి మంగళవారం తెలిపారు. బేస్తవారిపేట మండలంలో ఒక దుకాణానికి లైసెన్సు ఫీజుగా రూ.32.5 లక్షలు, అర్ధవీడు మండలంలో మరో దుకాణానికి లైసెన్సు ఫీజుగా రూ.27.5 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఒక వ్యక్తికి ఒకటికన్నా ఎక్కువ షాపులు దక్కినా ఒకటి మాత్రమే ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, రూ.2 లక్షలు బ్యాంకులో డీడీ తీయాలని, సొంత జిల్లాలోనే దుకాణం నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 5 లోగా దరఖాస్తు చేసుకుంటే 7వ తేదీన లాటరీ నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు గెజిట్ నోటిఫికేషన్ పరిశీలించాలని, లేదా 9440902508ను సంప్రదించాలని ఎక్సైజ్ సీఐ సూచించారు.

పొదిలిలో పరిధిలో 3 దుకాణాలు

పొదిలి: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గౌడ కులస్తులకు మూడు మద్యం దుకాణాలు కేటాయించినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ అరుణ కుమారి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొనకనమిట్ల, మర్రిపూడి, తర్లుపాడు మండలాల్లో 3 దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. దుకాణం కోసం ఆ సామాజికవర్గం వారు జిల్లాలో ఎక్కడనుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దుకాణం పొందిన వారు మండల పరిధిలో ఎక్కడైనా నిర్వహించుకోవచ్చన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రఫీ

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో మంగళవారం ఆటో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్న కార్మికుల కుటుంబాల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ.. వ్యవసాయం పూర్తిగా దెబ్బతిన్న తర్వాత గ్రామీణ ప్రాంతంలోని యువత ఆటోలు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రవాణ రంగం ద్వారా ప్రభుత్వానికి వివిధ పన్నుల రూపంలో రూ.వేల కోట్ల ఆదాయం వస్తున్నా కార్మికుల సంక్షేమ కోసం బోర్డు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, యూనియన్ నాయకులు హుస్సేన్, రాజు, పాములేటి, శివ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

కంభం: రహదారి నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కంభం సీఐ మల్లికార్జున హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీఐ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. మైనర్లకు వాహనాలిచ్చి రోడ్లపైకి పంపితే తల్లిదండ్రుల మీద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని హితవు పలికారు.

మానవహక్కుల పరిరక్షణకు కృషి



శ్రీనివాసులును సన్మానిస్తున్న హరిహరరావు తదితరులు

మార్కాపురం టౌన్: మానవహక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సాయిబాబా గుడి సెక్రటరీ గోపాలుని హరిహరరావు సూచించారు. హ్యూమన్‌రైట్స్ విభాగం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమితులైన మార్కాపురం పట్టణానికి చెందిన కమలపురి శ్రీనివాసులును మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవితోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, హక్కుల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదిశంకరాచార్యుల బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి సోమయాజుల సుబ్బుశాస్త్రి, మార్కండేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ వాలిచర్ల కేశవశర్మ, దూలిపాళ్ల మధు, సాయి సుబ్బారావు, రోటరీ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి

- డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్



మూగచింతలలో పనులను పరిశీలిస్తున్న జోసెఫ్‌కుమార్

పొదిలి రూరల్: జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ ఉపాధి హామీ పని కల్పించాలని డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమార్ పేర్కొన్నారు. పొదిలి మండలంలోని మూగచింతల పంచాయతీలో ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. కూలీలు ఉదయం 6 గంటలకు నిర్దేశిత ప్రదేశానికి హాజరై ఎక్కువ సేపు పని చేయడం వల్ల కూలీ అధికంగా పొందవచ్చని చెప్పారు. 100 రోజులు పూర్తి కావచ్చిన కుటుంబాలకు త్వరితగతిన డిమాండ్ ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు రోజుకు రూ.300 వచ్చేలా మార్కింగ్ ఇవ్వాలని ఫీల్డ్ సిస్టెంట్‌కు సూచించారు. రానున్న ఆరు నెలల్లో చేపట్టవలసిన పనుల జాబితాను ఫీల్డ్ అసిస్టెంట్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో గుర్తించిన అమృత సరోవర్ ట్యాంక్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఆయన వెంట ఏపీడీ ఆర్.లలిత, ఏపీఓ వెంకట్రావు, ఈసీ శివకుమార్ ఉన్నారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరణ చేయాలి



పూర్తి చేసిన అప్లికేషన్ ఫారాలు చూపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బేస్తవారిపేట: అంగన్‌వాడీ కార్యాకర్తలు, ఆయాలను గ్రేడ్ 3, గ్రేడ్ 4 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేయాలని సీఐటీయూ నాయకుడు షేక్ అన్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం సుప్రీం కోర్టు, హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రాన్ని పంపే కార్యక్రమాన్ని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి నిర్వహించారు. గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం క్రమబద్ధీకరణ, 7వ పే కమిషన్ సిఫారసులకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేల చొప్పున చెల్లించాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు వడ్డీతో సహ గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. గత ఏడాది సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా పంచాయతీరాజ్ భవనం!



పెచ్చులూడిన పంచాయతీరాజ్ భవనం పైకప్పు



పైకప్పులో భాగంలో పెరిగిన చెట్లు

పొదిలి రూరల్: స్థానిక పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ఉప కార్యపాలక ఇంజినీర్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలో పంచాయతీరాజ్ డీఈ, ఏఈతోపాటు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భవనం శ్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో పాటు ఇనుప చువ్వలు బయట పడ్డాయి. పైకప్పు భాగంలో చెట్లు పెరిగి గోడలు బీటలు వారాయి. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచి పెచ్చులూడిన ప్రాంతం మొత్తం ఉరుస్తోంది. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, సైడు కాలువల నిర్మాణ పనులను పర్యవేక్షించడం, బిల్లులు చేయడం తదితర పనులు ఈ కార్యాలయం ద్వారానే సాగుతాయి. ఈ నేపథ్యంలో వివిధ పనుల కోసం వచ్చిన వారు పంచాయతీరాజ్ భవనాన్ని చూసి ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పాలకులు స్పందించి నూతన భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ అధికారులతోపాటు ప్రజల నుంచీ వస్తోంది.

నేడు దివ్యాంగులకు వైద్య పరీక్షలు

కొమరోలు: గిద్దలూరు పట్టణంలోని ఏరియా వైద్యశాలలో బుధవారం దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎండీడీఓ మస్తాన్‌వలి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వైద్య పరీక్షలు నిర్వహించి, పరికరాలు అవసరమైన గుర్తిస్తారని పేర్కొన్నారు.

పచ్చిరొట్ట పైర్ల సాగుతో ప్రయోజనాలు

- ఏడీఏ బాలాజీనాయక్



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్



టి.సల్లూరులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ

బేస్తవారిపేట: రైతులు పచ్చిరొట్ట పంటలను సాగు చేసుకోవాలని సహాయ వ్యవసాయశాఖ సంచాలకుడు డీ బాలాజీ నాయక్ అన్నారు. బేస్తవారిపేట, పాపాయిపల్లె ఆర్‌బీకేలలో రైతులతో మంగళవారం మాట్లాడారు. జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవడంతో భూమికి 2 శాతం నత్రజని, సూపర్ పాస్పేట్ అందుతుందన్నారు. జింకు, మాంగనీసు, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటలకు అందుతాయని తెలిపారు. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయని, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిని జక్కం మెర్సీ, ఉద్యానవన విస్తరణాధికారి శేషగిరి, వీఏఏలు సుజాత, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక వ్యవసాయం కొనసాగించాలి

గిద్దలూరు రూరల్: రైతులు సాంకేతిక వ్యవసాయం కొనసాగించాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాములపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నేషనల్ పెస్ట్‌సర్వేలెన్స్ సిస్టమ్ అప్లికేషన్ పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వారు పండించే పంట పొలాల్లో ఉన్న తెగుళ్లు, పురుగుల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వెంటనే వాటి నివారణ చర్యలు తెలుపుతుందన్నారు. పురుగుల నివారణ కోసం తగు మందులను నిర్ధారించిన తరువాత వాటిని పిచికారి చేసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం గురించి ప్రతి రైతు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులు సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పొదిలి రూరల్: ఖరీఫ్‌లో కంది పంట ఈ క్రాప్ చేయించుకున్న రైతులందరూ సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌కే జైన్‌లాబ్దిన్ తెలిపారు. సోమవారం పొదిలి మండలంలోని టీ–సల్లూరులో రైతులకు అవగహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే కంది కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తిని విక్రయించుకోవడానికి అవకాశం ఉండదని చెప్పారు. రబీలో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్‌తో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణాధికారి ధనలక్ష్మి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.